

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 70

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.114	165	188
సూర్యాపేట	రూ.135	173	200
నల్లగొండ	రూ.119	173	196

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 20.0

ఎరువుల నిల్వలపై నిఘా

యాసంగి సీజన్ ప్రారంభమైంది. గత ఏడాది పలు ప్రాంతాల్లో ఎరువుల కొరత నెలకొని రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఆ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఎరువుల కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎరువులు, విత్తనాల దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సీజన్ ముగిసే వరకు దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. దుకాణా ల్లో నిల్వలు, స్టాక్‌రిజిస్టర్లను ఎప్పటికప్పుడు పోల్చిచూస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి/ నల్లగొండ/ సూర్యాపేట సిటీ)

- కొరత సృష్టించకుండా చర్యలు
- నిరంతరం విక్రయాలపై పర్యవేక్షణ
- ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశం
- ఈ-పాస్ యంత్రాలతోనే విక్రయాలు



వివరాలు మెట్రిక్ టన్నుల్లో

జిల్లా	యూరియా	డీఏపీ	ఎంవోపీ	కాంప్లెక్స్	ఎస్ఎస్‌పీ
యాదాద్రి	11,391	1,312	1,028	4,992	-
సూర్యాపేట	10,924	2,621	651	11,731	624
నల్లగొండ	36,670	3,000	3,200	15,000	913

దుకాణాల్లో తనిఖీలు చేపట్టేందుకు వ్యవసాయ అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ మేరకు ఏవోలు, ఏడీఏలు వారానికి 10 చొప్పున దుకాణాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. జిల్లా వ్యవసాయ అధికారి వారానికి ఐదు దుకాణాల్లో ఎరువుల విక్రయాలను పర్యవేక్షించి, సమీక్షించాల్సి ఉంటుంది. వారంలో రెండు రోజుల పాటు ఎరువుల నిల్వల వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా? దిగుమతి చేసుకున్న స్టాక్‌కు, విక్రయించిన స్టాక్‌ల మధ్య తేడా ఉందా? అన్న అంశాలను పరిశీలించనున్నారు. అదేవిధంగా ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించేందుకు, సకాలంలో సరఫరా చేసేందుకు జిల్లాయంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎరువులను అధికధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది.

ఈ-పాస్ యంత్రాల ద్వారానే

ఈ-పాస్(ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) ద్వారానే ఎరువులు, విత్తనాలను విక్రయించి ఎప్పటికప్పుడు రికార్డులను ఆన్‌లైన్ నమోదు చేయాల్సి ఉంటుంది. ఎరువులు, విత్తనాల విక్రయాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండటానికి ఈ-పాస్ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఈ యంత్రాల ద్వారా విక్రయాలతో స్టాక్ నిల్వలు, ఎంత విక్రయం, ఇంకా ఎంత అవసరం అనేది స్పష్టత వస్తుండటంతో కొంత మేరకు సమస్యలు తొలగిపోయాయని తెలుస్తుంది. అయినప్పటికీ కొంతమంది వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారన్నా ఆరోపణలు ఉన్నాయి. ప్రతీ వ్యవసాయ సీజన్‌లో కంటే వానాకాలం, యాసంగి సీజన్లలో ముందస్తుగానే ఎరువులను, విత్తనాలను జిల్లాలో రైతుల అవసరాలకు, పంట విస్తీర్ణానికి అనుగుణంగా నిల్వలను అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది.

యాదాద్రి జిల్లాలో..

యాదాద్రిభువనగిరి జిల్లాలో మొత్తం 17మండలాలు ఉన్నాయి. ఇప్పటివరకు 2.26లక్షల ఎకరాలకు వరకు వరితో పాటు పలుపంటలను సాగుచేశారు. మొత్తం 195విత్తన, ఎరువుల డీలర్ షాపులు ఉన్నాయి. వీటిలో పీఏసీఎస్, ఏఆర్ఎస్‌కేతో పాటు ప్రైవేట్ డీలర్లు ఉన్నారు. వ్యవసాయ అధికారుల బృందం జిల్లాలోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి, ఎరువుల విక్రయాలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని డీలర్ల వద్ద ఉన్న పాత స్టాక్ వివరాలను సేకరిస్తున్నాయి. డీలర్ల వద్ద ఉన్న పాత స్టాక్‌ను అదే ధరలకు రైతులకు విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది డీలర్ల వద్ద మిగిలిన ఎరువులను పాత ధరలకే విక్రయించాలని, కొత్త ధరలకు విక్రయించరాదని స్పష్టం చేశారు. కృత్రిమ ఎరువుల కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

నల్లగొండ జిల్లాలో ...

నల్లగొండ జిల్లాలో 925 లైసెన్స్ కలిగిన ఎరువుల దుకాణాలు ఉన్నాయి. పెద్ద దుకాణాలతో పాటు గ్రామీణప్రాంతాల్లోనూ ఎరువుల దుకాణాలు ఉన్నాయి. గతంలో పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. గత ఏడాది సెప్టెంబరులో ఎరువుల నిల్వలను పరిశీలించకుండానే 8 మంది వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నిల్వలు ఉన్నట్లు రిపోర్టు ఇవ్వడంతో సమస్యలు ఏర్పడ్డాయి. యూరియ కోసం రైతులు రోడ్లపై ఆందోళన చేయగా అధికారులు మాత్రం ఎరువులు ఉన్నట్లు తప్పుడు నివేదిక ఇచ్చారు. దీంతో అప్పట్లో ప్రభుత్వం ఎనిమిది మంది అధికారులను విధుల నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో వారం వారం ఏవోతో పాటు ఏడీఏలు 10దుకాణాలను తనిఖీ చేయడం ప్రారంభించగా జిల్లా వ్యవసాయ అధికారి ఐదు దుకాణాలను తప్పనిసరిగా తనిఖీ చేయాల్సి వస్తోంది. అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చి సస్పెండ్ అయిన అనంతరం జిల్లాలో వ్యవసాయ అధికారులు నూతనంగా దుకాణాల తనిఖీని సందర్శించడం మొదలు పెట్టారు. ఇదే విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. నల్లగొండ జిల్లాలో ఈ సీజన్‌లో 56 వేల మెట్రిక్‌టన్నుల ఎరువులు అవసరం ఉన్నాయి.

జిల్లాలో 400 దుకాణాలు..

యాసంగిలో సూర్యాపేట జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో అత్యధికంగా వరి పంటను సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 400కు పైగా ఎరువుల దుకాణాలు ఉన్నాయి. మొత్తం 152.289 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, 26,552 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు ప్రస్తుతం ఎరువుల దుకాణాల్లో ఉన్నాయి. ఇప్పటికే 7,178 మెట్రిక్ టన్నులు విక్రయించారు.

ఎరువుల నిల్వలపై పర్యవేక్షణ

యాసంగి సీజన్‌లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేందు కు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు జిల్లాలో ఉన్నటువంటి ఫెర్టిలైజర్ దుకాణాల్లో నిరంతరం తనిఖీలు చేయను న్నాం. ఈమేరకు ఏవోలు, డీఏవోలు వారానికి 10 దుకాణాలను తనిఖీ చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. కృత్రిమ ఎరువులు, విత్తనాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. సీజన్‌లో రైతులకు సరిపడ విత్తనాలు, ఎరువులు కూడా అందుబాటులో ఉంచుతాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని షాపుల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేపట్టాం.



- కె.అనురాధ, జేడీఏ, యాదాద్రిభువనగిరి జిల్లా

పోచంపల్లి ఇక్కత్

చీరలకు విశ్వఖ్యాతి



ఇక్కత్ చీరలను పరిశీలిస్తున్న విదేశీ పర్యాటకులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టు చీరలకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని ఇంగ్లాండ్‌కు చెందిన మిస్ మేరియన్, జానె అనే పర్యాటకులు కితాబుఇచ్చారు. భారత్ పర్యటనలో భాగంగా ఏడు వారాలపాటు దేశంలోని వివిధ ప్రాంతాలను పర్యటిస్తూ వారు మంగళవారం యాదాద్రి-భువనగిరి జిల్లాలోని చేనేత పట్టుచీరల ఉత్పత్తి కేంద్రమైన భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. పోచంపల్లి సహకార సంఘంలోని చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరలను పరిశీలించారు. చేనేత పట్టుచీరల డిజైన్లను, నాణ్యతను పరిశీలించి చేనేత కళాకారుల అద్భుతమైన కళాప్రతిభను వారు ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళీ శాఖ ఏడీ విద్యాసాగర్, డీవో ప్రసాద్, సహకార సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు బ్రేక్

భువనగిరి టౌన్, జనవరి 23: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో తల్లిదండ్రులను భాగస్వాములు చేసే లక్ష్యంతో ఏర్పాటుచేసిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఎన్నికలను నిలిపివేస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ నెల 29న జరుగాల్సిన ఎస్ఎంసీ ఎన్నికలకు బ్రేక్ పడింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎన్నికలను నిర్వహించవద్దని డీఈవోలు, ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ చేశారు. షెడ్యూల్ ప్రకారం 24న ఓటర్ల తుదిజాబితా ప్రదర్శన, 29న ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. విద్యాశాఖ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని 3,235 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిలిచిపోయాయి.వాటిలో 4,18,789మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2019 డిసెంబరులో ఎన్నికైన ఎస్ఎంసీ కమిటీల గడువు 2021 డిసెంబరుకే ముగిసినా అప్పటినుంచి ప్రతీ 6 మాసాలకు గడువును పొడగించగా, తుదిగడువు గత డిసెంబరుతో ముగియగా, నూతన కమిటీల కోసం ఎన్నికలు నిర్వహించే క్రమంలో విద్యాశాఖనిర్ణయంతో నిలిచాయి.

అవిశ్వాసానికి జైకొట్టారు



నేరేడుచర్ల మునిసిపల్ కార్యాలయంలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

జిల్లాలో మునిసిపల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఎత్తులకు పైఎత్తులు వేస్తూ అధికార పీఠాన్ని దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్నాళ్లు తమ వెంటే ఉన్న కౌన్సిలర్లు పక్క పార్టీలకు జంప్ కావడంతో రాజకీ య సమీకరణలు మారి చైర్మన్ పీఠాలు చేజారిపోతున్నాయి. నేరేడుచర్ల మునిసిపాలిటీలో పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో అధికార మార్పిడి ఖాయమైంది.

● నేరేడుచర్ల

నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మొత్తం కౌన్సిలర్లు 14 మంది ఉండగా, ఎక్స్‌అఫీషియో సభ్యులు ఇద్దరున్నారు. 16 మందికి 13మంది హాజరుకాగా వారంతా చేతులెత్తి అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకడంతో జయబాబు తన పదవిని కోల్పోయాడని హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు మునిసిపల్ సమావేశ మందిరం లో సమావేశం ప్రారంభం కాగా అవిశ్వాసానికి ఎంత మంది మద్దతు తెలుపుతున్నారో చేతులెత్తాలని ఆర్డీవో సూచించగా అందరూ ఎత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించారు. విషయాన్ని సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపినట్లు ఆర్డీవో తెలిపారు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక విషయంపై జిల్లా కలెక్టర్ ఎన్నికల సంఘానికి నివేదిక పంపుతాడని, అక్కడి నుంచి అనుమతులు వచ్చిన తరువాత ఎన్నిక ఉంటుందన్నారు.

విప్ పట్టుకొని తిరిగి గైర్హాజరు

సభ్యులకోసం ఇంటింటికీ తిరిగి విప్‌జారీ చేయించుకున్న మునిసిపల్ మాజీ చైర్మన్ చందమళ్ల జయబాబు సమావేశానికి హాజరుకాలేదు. అదే విధంగా ఎక్స్‌అఫీషియో సభ్యులు రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ శేరి శుభాష్‌రెడ్డిలు రాలేదు.

పార్టీ బలాబలాలు

అవిశ్వాసంలో కాంగ్రెస్ పార్టీ నెగ్గేందుకు, బీఆర్ఎస్ చైర్మన్‌ను గద్దె దింపేందుకు కౌన్సిలర్లు క్యాంపు బాట పట్టారు. మునిసిపాలిటీలో 15 వార్డులుండగా, 13వ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ పదవులకు చల్లా శ్రీలతారెడ్డి రాజీనామా చేయడంతో ఒక కౌన్సిలర్ పదవి ఖాళీ అయ్యింది. దీంతో 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 14 మందిలో చైర్మన్ జయబాబును మినహాయిస్తే 12 మంది కౌన్సిలర్లు క్యాంపులోకి వెళ్లిపోయారు. 23వ తేదీన నేరుగా క్యాంపు నుంచి మునిసిపాలిటీకి చేరుకోనున్నారు. 15 వార్డులకు గాను 7 కాంగ్రెస్, 7 బీఆర్ఎస్, 1 సీపీఎంలు గెలుపొందాయి. బీఆర్ఎస్‌నుంచి గెలుపొందిన శ్రీలత రాజీనామాతో బీఆర్ఎస్ బలం 6కు చేరింది. సీపీఎం, కాంగ్రెస్‌లు పొత్తు ఉండడంతో వారి సంఖ్యా బలం 8గా ఉంది. ఇటీవల కాలంలో బీఆర్ఎస్‌కు చెందిన అలుక సరిత, బాషా, కుంకు సులోచన కాంగ్రెస్‌లో చేరారు. దీంతో వారి బలం 11కు చేరింది. 14వ వార్డు కౌన్సిలర్ వేమూరి నాగేవణి, 9వ వార్డు కౌన్సిలర్ అమరవరపు లలితలు బీఆర్ఎస్‌లోనే ఉన్నా కాంగ్రెస్‌కు మద్దతు పలికారు. దీంతో జయబాబు ఒక్కరే మిగిలిపోయారు. ఎక్స్ అఫీషియోగా ఉన్న సభ్యులలో కేవీపీ రాంచందర్‌రావు పదవీకాలం ముగియడం, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేయడం, శానంపూడి సైదిరెడ్డి ఓడిపోవడంతోపాటు పదవీకాలం ముగిసిన ఎమ్మెల్సీ బోడికంటి వెంకటేశ్వర్లు ఓటు హక్కును కోల్పోయారు. ఎమ్మెల్సీ శేరి శుభాష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌లు సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరిద్దరితో పాటు జయబాబు కూడా గైర్హాజరయ్యారు. హాజరైన 13 మంది సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు.

బలాబలాలు

సంవత్సరం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఇతరులు	మొత్తం
నేరేడుచర్ల..					
2020	7	7	1	-	15
2024	3	10	1	ఒకరు రాజీనామా (బీఆర్ఎస్)	14

ఎన్నిక ఇలా..

- నేరేడుచర్ల మునిసిపల్ కౌన్సిలర్లు కలెక్టర్‌కు నోటీసు ఇచ్చారు.
- 23వ తేదీన అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ ఇటీవల ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు.
- ఆర్డీవో నుంచి కౌన్సిలర్లకు నోటీసులు అందాయి.
- 18వ తేదీన జయబాబు విప్ జారీచేస్తూ కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేయాలని తన అనుచరులకు చెప్పారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులకు విప్ జారీచేసే ప్రయత్నం చేశారు.
- ఇది గమనించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు 20వ తేదీన క్యాంపు కార్యాలయానికి వెళ్లారు.
- అక్కడే మూడు రోజుల పాటు ఉన్న సభ్యులు 23వ తేదీన ఉదయం మిర్యాలగూడకు చేరుకున్నారు. అక్కడ అల్పాహారం అనంతరం నేరేడుచర్ల మండల చిల్లేపల్లి మూసీ టోల్‌గేట్ వద్దకు వెళ్లి, అక్కడి నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల ర్యాలీతో మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. 11 గంటలకు సమావేశంలో అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. 12 గంటలకు మునిసిపల్ కార్యాలయం నుంచి బయటకు వెళ్లిపోయారు.

చైర్మన్ రేసులో ప్రకాష్

నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్‌గా 10వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ బచ్చలకూరి ప్రకాష్ ఒక్కరే రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. అతడి ఎన్నిక ఏకగ్రీవం కానున్నట్లు సమాచారం. వైస్‌చైర్మన్‌గా 5వ వార్డు నుంచి బీఆర్ఎస్ నుంచి గెలిచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన అలుక సరిత ఏకగ్రీవమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే కౌన్సిలర్ల మధ్య చర్చలు జరిగి వీరిద్దరిని ఎన్నుకోవాలని కౌన్సిలర్లు నిర్ణయించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ, మంత్రి నుంచి కూడా స్పష్టమైన హామీ ఉన్నట్లు సమాచారం.

హుజూర్‌నగర్ మునిసిపల్ వైస్‌చైర్మన్‌పై

నేడు అవిశ్వాసం

- విజయవాడ ఐలాండ్ క్యాంప్‌లో 20 మంది అసమ్మతి కౌన్సిలర్లు
- వైస్‌చైర్మన్ పదవిని ఆశిస్తున్న సంపత్‌రెడ్డి?

చిమిర్యాల పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై **నెగ్గిన అవిశ్వాసం**

పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లుచేయాలి

కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పంకజ్, సంతోష్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, ప్రియాంక

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 23 : పార్లమెంట్ ఎన్నికలకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పంకజ్, సంతోష్ అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి వీడియయోకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటరావు, ఇతర అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. కోడ్ ఉండే సమయంలో నగదు తరలింపు, మద్యం, ఇతరత్రా వస్తువుల క్రయవిక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. గత ఎన్నికల్లో రూపొందించిన క్యూఆర్‌కోడ్‌ను లక్షా 38వేల మంది వినియోగించుకున్నారని, త్వరలో ఈ-యాప్‌ను మరింత అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, వెంకట్‌రెడ్డి, ఎంఎంసీ నోడల్ అధికారి సతీష్‌కుమార్, ఎఫ్ఎస్‌టీఎస్ఎస్‌టీ బృందాలు పాల్గొన్నాయి.

వేసవిలో నీటిఎద్దడి నివారణకు చర్యలు

వేసవిలో జిల్లాలో ఎక్కడా నీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, సీఈ చెన్నారెడ్డితో కలసి మాట్లాడారు. భగీరథకు సంబంధించి 22 సమస్యలను గుర్తించామన్నారు. ఫిబ్రవరి 15వ తేదీలోగా కనెక్షన్లు, పైప్ డ్యామేజీ పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. మిగిలిన 8 పనులను ఫిబ్రవరి చివరినాటికి పూర్తిచేయాలన్నారు. వేసవికి జిల్లాలో ప్రతీ ఇంటికి భగీరథ నీరు అందాలని ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఈవో సురేష్, ఈఈ అరుణాకరరెడ్డి, శ్రీనివాస్, డీపీవో యాదయ్య, ఎంపీడీవోలు ఎంపీవోలు పాల్గొన్నారు.

ఇంటి పన్ను నూరుశాతం పూర్తి చేయాలి

గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నులను నిర్ధేశించిన సమయంలోపు నూరుశాతం పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటరావు ఆదేశించారు. ఇంటిపన్ను వసూళ్లపై కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటిపన్నులు ఇప్పటివరకు కేవలం 50శాతం పూర్తి చేశారని, ఫిబ్రవరి 10వ తేదీలోపు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఫిబ్రవరిలో ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నాటిని ప్రతి మొక్కకూ నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సురేష్, డీఆర్‌డీవో పీడీ సుందరి కిరణ్‌కుమార్, డీపీవో యాదయ్య, ఎంపీడీవోలు, ఎంపీవోలు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం దుర్మార్గమైన చర్య



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న దళితసంఘాల నాయకులు

సూర్యాపేట టౌన్, జనవరి 23: దళిత మహిళ అని చూడకుండా పదవీ కాలం పూర్తికాకముందే అవిశ్వాసం పెట్టడం దారుణమని దళిత సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణపై అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన దీక్షతో పాటు రాస్తారోకో చేశారు. సమాజంలో కులవివక్ష పోలేదని, అందుకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసమే నిదర్శనమన్నారు. అవిశ్వాస తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఉద్యమిస్తామన్నారు. అనంతరం అక్కడే రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, తలమల్ల హసెన్, చింతలపాటి చినశ్రీరాములు, తప్పెట్ల శ్రీరాములు, గుండగాని నాగభూషణం, దశరథ, శ్రీరాములు, పరుశరాం, రవి, దేవయ్య, కనకయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి

సూర్యాపేట క్రైం, జనవరి 23 : రోడ్డు భద్రతా, ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీజీపీ రవిగుప్తా అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను, అవగాహన కార్యక్రమాలను ఎస్పీ రాహుల్‌హెగ్డే డీజీపీకి వివరించారు. సమావేశంలో డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్ పాల్గొన్నారు.



డీజీపీతో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

న్యాయవాదులు, పోలీస్‌సిబ్బందికి అభినందనలు

కోర్టుల్లో కేసుల వాదనలను, బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తు, కోర్టు పోలీసు విధులను సమన్వయంతో చేసిన సిబ్బందిని ఎస్పీ రాహుల్‌హెగ్డే అభినందించారు. నిందితులకు శిక్షలు విధిస్తూ కోర్టులు ఉత్తర్వులు ఇవ్వడంతో తరుచూ నేరాలకు పాల్పడుతున్న వారు నేరాలు చేయడానికి భయపడుతున్నారని తెలిపారు. వారం రోజుల్లో మూడు ప్రధాన కేసుల్లో నిందితులకు శిక్షలు పడటంపై సిబ్బందిని అభినందించారు. పెన్‌పహాడ్ మండలం జలమలకుంట తండాలో లునావత్ స్వామి 2020లో హత్య చేయగా అభియోగపత్రాలు కోర్టుకు అందజేయడంతో జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు.మద్దిరాల మండలం పోలుమల్లలో 2016లో రాగిణి లావణ్యను భర్త లింగయ్య హత్య చేయగా అభియోగపత్రాలు కోర్టులో సమర్పించడంతో నిందితుడికి జీవితఖైదు పడిందన్నారు. మోతె మండలంలో మైనర్‌ను కిడ్నాప్ కేసులో గంట మహేష్‌పై పోక్సో కేసు నమోదు చేసి, కోర్టుకు అభియోగాలు అందజేయడంతో అతడికి 34 ఏళ్ల జైలుతో పాటు రూ.60వేలు జరిమానా కోర్టు విధించిందన్నారు.

గురుకుల విద్యార్థిని మృతిపై విచారణ

కొండమల్లేపల్లి, జనవరి 23: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని భార్గవి మృతిచెందడంతో కొండమల్లేపల్లి ఎస్‌ఐ వీరబాబు పాఠశాలలో మంగళవారం విచారణ నిర్వహించారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. భార్గవి స్నేహితులు, ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

బొమ్మలరామారం, అడ్డగూడూరు, నార్కట్‌పల్లి జనవరి 23: యాదాద్రిభువనగిరి, నల్లగొండ జిల్లాల్లో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి- యాదగిరిగుట్ట రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడు మృతిచెందాడు. జలాల్‌పురం గ్రామానికి చెందిన దివ్యాంగుడైన మోటె ఐలయ్య తన వికలాంగుల వాహనంపై మండలకేంద్రం నుంచి తన గ్రామానికి వెళ్తుండగా మండలకేంద్రానికి చెందిన నాగిరెడ్డి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్ యాదగిరిగుట్ట దేవస్థానం నుంచి బైక్‌పై బొమ్మలరామారం వైపు వస్తున్నారు. మండల కేంద్రం శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో దివ్యాంగుడు మోటె ఐలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్‌ను అంబులెన్స్‌లో ఈసీఐఎల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఐలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్థులు సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సుమారు నాలుగు గంటల పాటు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు, గ్రామపెద్దలు మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

అడ్డగూడూరు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కన్నెబోయిన లింగయ్య(62) నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని లింగోటంలో శుభకార్యానికి వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా అడ్డగూడూరు మండలంలోని మానాయికుంటా గ్రామ శివారులో మంగళవారం రాత్రి బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

రోడ్డు యూటర్న్ చేస్తుండగా

నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని ఇస్మాన్‌పల్లికి చెందిన రేకల పాపయ్య (54) తన సోదరుడు మధుసూదన్‌తో కలిసి పని నిమిత్తం బైక్‌పై నార్కట్‌పల్లికి వచ్చారు. పట్టణ శివారు చింతల్ వద్ద ఓ హోటల్‌లో భోజనం చేసి బయలు దేరారు. గోపలాయపల్లి ఆలయానికి వెళ్లే ఆర్చి ఎదురుగా ఉన్న జంక్షన్ వద్ద నార్కట్‌పల్లి వైపునకు యూటర్న్ చేస్తుండగా అదే దారిలో వెనుక నార్కట్‌పల్లి వైపు నుంచి చిట్యాల వైపుకు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. మధుసూదన్ బైక్ నడుపుతుండగా వెనుక కూర్చున్న పాపయ్య ఎగిరి రోడ్డుపై పడిపోయాడు. పాపయ్య తలకు గాయాలు కావడంతో నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మధుసూదన్‌కు గాయాలయ్యాయి. పాపయ్య కుమారుడు శ్రవణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపారు.

నకిలీ 'పోచంపల్లి'!

పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు

భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు

200 ప్రింటింగ్ చీరలు సీజ్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకేఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరి కొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.



వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు


ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్‌ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్‌ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ తరఫున 19 మంది; బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్‌ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్‌ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాల్టీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, అందోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాల్టీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాల్టీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాల్టీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాల్టీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే 'అసెంబ్లీ సమీక్షలు'

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్

పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్‌ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకోర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్టు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరోవైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్న ట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.



రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి

తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు

తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

పేటలో పడకేసిన పారిశుధ్యం

» సూర్యాపేటలోని పుల్లారెడ్డి చెర్వు వద్ద రోజుల తరబడి వ్యర్థాలు » దుర్గంధంలో ప్రజల ఇబ్బందులు

సూర్యాపేట మునిసిపాలిటీలో పారిశుధ్యం పడకేసింది. పట్టణ ఓటర్లతో గెలుపొందిన కొంత మంది అసమ్మతి వర్గ కౌన్సిలర్లు మునిసిపాలిటీ చైర్మన్, చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించి, సాధించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో సూర్యాపేట పట్టణంలో పారిశుధ్యంపై పర్యవేక్షణ లోపించింది. దీంతో ఎక్కడా చూసినా అపరిశుభ్ర వాతావరణం దర్శనమిస్తోంది.

- సూర్యాపేట సిటీ



సూర్యాపేటలోని పుల్లారెడ్డి చెరువు నాల వద్ద భారీగా నిల్వ ఉన్న వ్యర్థపదార్థాలు

సూర్యాపేట పట్టణంలో ఏ వార్డులో చూసినా పారిశుధ్యం అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. పట్టణంలోని పేరుకుపోయిన పారిశుధ్య పనులపై మునిసిపల్ అధికారులు దృష్టి సారించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోజుల తరబడి మురుగు కాల్వలను శుభ్రం చేయనందున దుర్గంధం వెదజల్లుతున్నాయని, పట్టణంలో రాత్రి వేళ దోమలబెడద చాలా ఎక్కువైందన పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం ఐదు గంటలకే ఇళ్లలో దోమలు మోత ప్రారంభమవుతోందని తెలిపారు. దోమలనివారణకు వార్డులో ఫాగింగ్ చేయడంలేదని, ప్రధాన కూడళ్లలో వ్యర్థ పదార్థాలను మాత్రమే తొలగిస్తున్నారని, మారుమూల వార్డుల్లోకి చెత్తను తరలించే మునిసిపాలిటీ ట్రాక్టర్ రావడం లేదని చెబుతున్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించాలని మునిసిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదంటున్నారు.

పుల్లారెడ్డి చెరువు వద్ద పేరుకున్న వ్యర్థాలు

పట్టణంలోని పుల్లారెడ్డి ప్రధాన నాలా వద్ద వ్యర్థాలు భారీగా పేరుకున్నాయి. వ్యర్థాలను మునిసిపాలిటీ సిబ్బంది రోజుల తరబడి తొలగించనందున భారీగా పేరుకుపోయాయి. ఈ నాలా మీదుగా వెళ్లే ప్రజలు దుర్గంధం భరించలేక అవస్థలు పడుతు న్నారు. వ్యర్థాలు తొలగించి, శుభ్రం చేయించాల్సిన మునిసిపాలిటీ అధికారులు ఈ వైపు దృష్టి సారించడం లేదు. మునిసిపల్ అధికారులు స్పందించి పుల్లారెడ్డి చెరువు నాలా వద్ద పెరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పారిశుధ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ముక్కులు ముసుకోవాల్సిన పరిస్థితి

పుల్లారెడ్డి నాలా వద్ద వ్యర్థాలతో ఈ ప్రాంతమంతా దుర్గంధం వస్తోంది. పనిచేసుకోలేకపోతున్నాం. దుర్వాసన భరించలేకపోతున్నాం. మునిసిపాలిటీ సిబ్బంది, అధికారులు పారిశుధ్యం పై దృష్టి సారించాలి. రాత్రి సమయంలో కూడా దోమల బెడద చాలా ఎక్కువైంది. కొన్ని నెలల నుంచి దోమల పొగ కొట్టడం లేదు.

- లింగాచారి, బైక్ మైకానిక్, జమ్మిగడ్డ

మునిసిపాలిటీ సిబ్బందితో శుభ్రం చేయిస్తాం

పుల్లారెడ్డి చెరువు నాలా వద్ద పేరుకున్న వ్యర్థాలను మునిసిపాలిటీ సిబ్బంది తో తొలగిస్తాం. నాలా వద్ద వ్యర్థాలు పేరు కోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటా. పట్టణంలో ఎక్కడైనా వ్యర్థాలు నిల్వ ఉంటే ఆ కాలనీవాసులు తమ పరిధిలోని మునిసిపాలిటీ జవాన్ దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవాలి.

- శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట మునిసిపాలిటీ

మునిసిపల్ కమిషనర్‌ను తొలగించాలి

● సీడీఎంఏకు తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్ ఫిర్యాదు

● బైఠాయించినా పట్టించుకోని అధికారులు

మోత్కూరు, జనవరి 23: తిరుమలగిరి మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ దండు శ్రీనివాస్ నిబంధనలకు విరుద్ధంగా, తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నందున అతన్ని తొలగించి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని తిరుమలగిరి మునిసిపల్ చైర్ పర్సన్ పోతరాజు రజనీరాజశేఖర్ కోరారు. ఈ మేరకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీఎండీఏ) దివ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఇన్‌చార్జి కమిషనర్, ఇన్‌చార్జి మేనేజర్ ఉండటంతో మునిసిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందని. మునిసిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీనివాసే ఉన్నారని, మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించే విషయాలు కూడా తనకు ముందుగా చెప్పడం లేదని, పాలనా వ్యవస్థను పక్కదారి పట్టిస్తున్నారని ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు.

మునిసిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన

ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆమె సోమవారం (ఈ నెల 22న) మునిసిపల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై సుమారు నాలుగు గంటల పాటు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషనర్ శ్రీనివాస్ అక్రమ లేఔట్లకు, కోర్టు కేసుల్లో ఉన్న ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయన తోటి ఉద్యోగుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశాలకు సంబంధించి తనను సంప్రదించడం లేదు. ప్రభుత్వ పథకాల సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మీకు చెప్పాల్సిన అవసరం లేదంటూ అమర్యాదగా మాట్లాడుతున్నారన్నారు. ఉద్యోగస్తుల రెన్యూవల్ అంశాన్ని మునిసిపల్ కౌన్సిల్‌లో చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేయమంటే మీకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసే హక్కులేదంటూ తనను అగౌరవపర్చారని మండిపడ్డారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాట చేయమనే హక్కు చైర్‌పర్సన్‌కు ఉండదా? అని ఆమె ప్రశ్నించారు. ఇన్‌చార్జి కమిషనర్, ఇన్‌చార్జి మేనేజర్‌ను తొలగించి రెగ్యులర్ అధికారులను నియమించాలని ఆమె డిమాండ్ చేశారు.

తిరుమలగిరి: తిరుమలగిరి మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌ను విధుల నుంచి తొలగించాలని చైర్‌పర్సన్ పోతరాజు రజిని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మునిసిపాలిటీ అభివద్ధికి కమిషనర్ సహకరించడం లేదని ఆరోపించారు. త్వరలో నిర్వహించే సర్వసభ్య సమావేశంలో ఎజెండా అంశాలను తనకు తెలియకుండా ఎలా రూపొందిచారని కమిషనర్‌ను ప్రశ్నిస్తే, మీకు చెప్పాల్సిన అవసరంలేదని బదులిచ్చారని తెలిపారు. ఉద్యోగుల పట్ల దురుసుగా కమిషనర్ ప్రవర్తిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇన్‌చార్జి పాలనలో ముని సిపాలిటీ అభివృద్ధి జరగడం లేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా ఆయన తన వైఖరిని మార్చుకోలేద న్నారు. కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, ఉన్నతాధికారులు స్పందించాలని ఆమె కోరారు.

మఠంపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

మఠంపల్లి, జనవరి 23: మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో మామిడి జానకిరాములు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు అభియోగాలు దృష్ట్యా సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కలికంగా రద్దు చేస్తూ ఎంపీవో ఆంజనేయులుకు చెక్ పవర్‌ను అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గ్రామ పంచాయతీకి చెందిన రూ.74.85లక్షలు సర్పంచ్ డ్రా చేసుకొని సొంతానికి వాడుకున్నట్లు కలెక్టరుకు ఫిర్యాదు అందాయి. ఈ విషయమై విచారణ చేయగా సర్పంచ్ ఇచ్చిన సమాధానం, వివరణ సరిగాలేనందున చెక్ పవర్‌ను రద్దు చేశారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం సర్పంచ్ నుంచి నిధులను 45రోజుల లోపు రికవరీ చేయాలని తహసీల్దార్ మంగారాథోడ్‌ను కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

శివాలయం చైర్మన్ రాజీనామా

మేళ్లచెర్వు, జనవరి 23: మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ పదవికి వర్రా వెంకటరెడ్డి రాజీనామా చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. రాజీనామా పత్రాన్ని ఆలయ ఈవో గుజ్జుల కొండారెడ్డికి మంగళవారం అందజేశారు. ఆయన గత ఏడాది ఫిబ్రవరి 13వ తేదీ నుంచి చైర్మన్‌గా కొనసాగుతున్నారు. తనకు ఇంతకాలం సహకరించిన ఆలయ సిబ్బందికి, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలి

సూర్యాపేట సిటీ, తుంగతుర్తి, జనవరి 23: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించే ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మండాది డేవిడ్‌కుమార్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకటరెడ్డి, తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి దండె వెంకటరెడ్డి కోరారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కమిటీ సమావేశంలో, తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని పద్మశాలి భవనంలో జరిగిన సీఐటీయూ, రైతు వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

హమాలీలకు నూతన వేతనాలు అమలు చేయాలి

సూర్యాపేట సిటీ, జనవరి 23: సూర్యాపేట పట్టణంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో హమాలీలుగా పనిచేస్తున్న కార్మికులకు నూతన వేతనాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణంలో నిర్వహించిన హమాలీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న ధరలు, ఆరోగ్య సమస్యలు, కుటుంబ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని ఫర్టిలైజర్ యజమానులు హమాలీలతో చర్చలు జరిపి నూతన వేతనాలను అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమలో ఎరుకల వెంకన్న, అర్వపల్లి, సత్యనారాయణ, గండు సైదులు, శ్రీను, లింగయ్య, నారాయణ, శంభయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోలు బోల్తా: 15మంది కూలీలకు గాయాలు

మోతె, మేళ్లచెర్వు, జనవరి 23: మోతె, మేళ్లచెర్వు మండలాల్లో మంగళవారం ఆటోలు బోల్తా పడటంతో 18మంది కూలీలకు గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం లోని హుస్సేనాబాద గ్రామానికి చెందిన రైతు తోటలో మిరప కోతలకు నడిగూడెం మండలానికి చెందిన కూలీలు వచ్చారు. కోత ముగిసి ఆటోలో వెళ తుండగా మోతె పోలీస్‌స్టేషన్ సమీపంలో నడిగూడెం వెళ్లే రోడ్డు మూలమలుపు వద్ద ఆటో పల్టీ కొట్టింది. డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ బ్రేకులను సరిగా వేయనందునే ఆటో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో 15మంది గాయపడగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

● కోదాడ మండలంలోని సాలార్జింగ్ పేటకు చెందిన కొంతమంది కూలీలు మిర్చి కోతల కోసం చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామానికి వెళుతున్నారు. మార్గమధ్యలో మేళ్లచెర్వు మండలకేంద్రంలోని హేమ్లాతండా క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న మరో ఆటోను తప్పించబోయి కూలీలు వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలోకూలీలు శివ, నర్సింహ, లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మునగాల, జనవరి 23: రోడ్డు ప్రమాదంలో గాయపపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్ఐ పి.లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం... మేళ్లచెర్వు మండలకేంద్రానికి చెందిన ఎస్.రామకృష్ణ(25)ఆటోలో సోమవారం సూర్యాపేట నుంచి మేళ్లచెర్వు వెళ్తుండగా, మార్గమధ్యలో ఆకుపాముల శివారులో ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రామకృష్ణ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేతాజీ స్ఫూర్తితో యువత పోరాడాలి

సూర్యాపేట రూరల్, జనవరి 23: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో అరాచక శక్తులపై యువత పోరాడాలని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం కోరారు. సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా మండలంలోని బాలెంల సమీపంలో ఉన్న గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసినా సమావేశంలో ఆయన మాట్లాడారు. . కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, కళాశాల కోఆర్డినేటర్లు డి.మాధవి, ప్రియాంక పాల్గొన్నారు.



సూర్యాపేట మండలం బాలెంల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

సూర్యాపేట టౌన్: నేతాజీ ఆశయాలను సాధించాలని సూర్యాపేట పూర్వ మిత్రమండలి గౌరవ సలహాదారుడు వై.నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో నిర్వహించిన నేతాజీ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు బయ్యా మల్లికార్జున్, షేక్ సైదులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీపీఐ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బట్టు మధు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: నేతాజీ జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అణగారిన కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాంసైదులు అన్నారు. మండలంలోని పొనుగోడు గ్రామంలో సుభాస్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో అనంతు కర్నాకర్, చామకూరి అంజిగౌడ్, ప్రసాద్, సైదులు, మధు పాల్గొన్నారు.

తుంగతుర్తి: నేతాజీ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ నాయకుడు ఓరుగంటి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం యాకయ్య, భాస్కర్, హరికృష్ణ పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తిన డైరెక్టర్లు

కోదాడ రూరల్, జనవరి 23: మండలంలోవని చిమిర్యాల పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. జిల్లా సహకార అధికారి శ్రీధర్ అధ్యక్షతన చిమిర్యాల సహకార సంఘ కార్యాలయంలో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మన్ ముత్తవరపు రమేష్, వైస్ చైర్మన్ గడిపూడి పుష్పావతి గైర్హాజరయ్యారు. అవిశ్వాస నోటీసుపై సంతకాలు పెట్టిన 11మంది డైరెక్టర్లు కొత్త రఘుపతి, నర్రా వెంకటేశ్వర్లు, కనగాల నర్సింహారావు, ధరావత్ నెహ్రూ, పిల్లి నాగభూషణం, యరమాల కుమారి, ముండ్రా నర్సింహారావు, గద్దె నరేందర్, పత్తిపాక రామకృష్ణ, ముండ్రా నరేష్, కొక్కు రామకృష్ణ సమావేశానికి హాజరయ్యారు అవిశ్వాస తీర్మాణానికి అనుకూలంగా ఈ 11మంది చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గిందని, చైర్మన్ ముత్తవరపు రమేష్, వైస్ చైర్మన్ గడిపూడి పుష్పావతిని పదవుల నుంచి తొలగిస్తున్నట్లు శ్రీధర్ ప్రకటించారు. నూతనంగా చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ఈ నెల 24వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 12 గంటల నుంచి 12.30 గంటల వరకు పరిశీలన, అనంతరం నామినేషన్ల జాబితా ప్రచురణ, మధ్యాహ్నం ఒంటి గంటకు ఉపసంహరణ, 1.30గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, రెండు గంటలకు ఎన్నికను నిర్వహిస్తామన్నారు. అవిశ్వాస సమావేశం సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమావేశంలో సింగిల్ విండో డైరెక్టర్లతో పాటుగా జిల్లా సహకార రిజిస్ట్రార్ ఇందిర పాల్గొన్నారు.

చైర్మన్ పదవి కోసం తీవ్ర పోటీ

చిమిర్యాల సహకార పరపతి సంఘం కింద చిమిర్యాల, దోరకుంట, నల్లబండగూడెం, మంగళితండా గ్రామాలు ఉన్నాయి. చైర్మన్ పదవిని చిమిర్యాల డైరెక్టర్ కొత్త రఘుపతికి ఇవ్వాలని ఆ గ్రామస్థులు పట్టుబడుతున్నారు. దోరకుంట డైరెక్టర్ గద్దె నరేందర్‌కు ఇవ్వాలని ఆ గ్రామస్థులు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలోనే ఈ రెండు గ్రామాల మధ్య పోటీ ఏర్పడింది. దీంతో చైర్మన్ పదవి ఎంపిక బాధ్యత ఎమ్మెల్యే పద్మావతి వద్దకు చేరింది.

హుజూర్‌నగర్ మునిసిపాలిటీపై కాంగ్రెస్ పూర్తి ఆధిపత్యం

● మునిసిపల్ వైస్ చైర్మన్‌పై నేడు అవిశ్వాసం

● కౌన్సిలర్ సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాంప్ రాజకీయం

● విజయవాడలో బస

హుజూర్‌నగర్, జనవరి 23: హుజూర్‌నగర్ మునిసిపల్ వైఎస్ జక్కుల నాగేశ్వరరావు అవిశ్వాస తీర్మానంపై ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి అధ్వర్యంలో బుధవారం సమావేశం జరగనుంది. మున్సిపల్ వైస్ చైర్మన్‌కు పోటీ పడుతున్న 3వ వార్డు కౌన్సిలర్ సంపత్‌రెడ్డి అంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఐల్యాండ్‌లో కౌన్సిలర్లకు క్యాంప్ ఏర్పాటుచేశారు. కీసర సమీపంలోని ఐతవరం సత్తెమ్మతల్లి ఆలయంలో మొక్కులు చెల్లించిన సంపత్‌రెడ్డి కౌన్సిలర్లతో విందులో పాల్గొన్నారు. అనంతరం ఐల్యాండ్‌లో ఏర్పాటుచేసిన శిబిరానికి తరలి వెళ్లారు. 28 మంది కౌన్సిర్లలో 20 మంది క్యాంప్‌నకు వెళ్లారు. కాగా బుధవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో వైస్‌చైర్మన్ పదవికి సంబంధించి అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించనున్నారు. పార్టీలకు అతీతంగా వైస్‌చైర్మన్‌పై 20 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించడంతో నెగ్గే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

2020 జనవరిలో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 20 మంది గెలుపొందగా, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరుగెలుపొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ బలాలు తారుమారయ్యాయి.



విజయవాడలోని క్యాంప్‌నకు తరలివెళ్లిన హుజూర్‌నగర్ కౌన్సిలర్లు

కాంగ్రెస్ శిబిరంలోకి జంపైన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు

బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు గతంలోనే కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన మరో ఇద్దరు కాంగ్రెస్ పార్టీలోకి మంగళవారం జంప్ అయ్యారు. విజయవాడలోని క్యాంప్‌లో చేరారు. 20 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లలో 14మంది కాంగ్రెస్‌లో చేరారు.. ఈ నెల 28న వైస్ చైర్మన్ ఎంపిక జరగనుందని తెలిసింది.

ఆసుపత్రిని పరిశీలించిన వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్

కోదాడ రూరల్, జనవరి 23: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ అజయ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని 20నుంచి 100పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్న ఆసుపత్రి భవనంలోనే కొత్త ఆసుపత్రి భవనం నిర్మించాలని అధికారులు నిర్ణయించడంతో ఆయన ఆసుపత్రిని పరిశీలించారు. త్వరలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నందున ఆయన ఈ పర్యటన చేసినట్లు తెలిసింది. ఆయన వెంట డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ దశరథ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్రమణలు తొలగించాలి

కోదాడ రూరల్, జనవరి 23: కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఆక్రమణలు తొలగించి 100పడకల ఆసుపత్రి భవనాన్ని ప్రస్తుత ఆసుపత్రి స్థలంలోనే నిర్మించాలని సామాజిక కార్యకర్త కుందరవెల్లి బసవయ్య రాష్ట్ర వైద్య విధాన పరిషత్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కలెక్టర్ వెంకట్రావ్, ఆర్డీవో సూర్యానారాయణకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు.

నూతన కార్మిక చట్టాలను రద్దుచేయాలి

హుజూర్‌నగర్ రూరల్, జనవరి 23: నూతన కార్మిక చట్టాలను కేంద్రం రద్దుచేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్యగౌడ్ కోరారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. దేశంలోని కార్మిక రంగాన్ని అణచివేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. సమావేశంలో రాము, ముక్కంటి, సావిత్రి, వెంకటమ్మ, జాన్‌సైదా, పాల్గొన్నారు.

దేవాలయ భూములను రక్షించాలి

నాగారం, జనవరి 23: మండలంలోని ఫణిగిరి గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ భూములను, ప్రభుత్వ బంచరాయి భూములను రక్షించాలని ఫణిగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పులిగిల్ల వీరమల్లుయాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరమల్లు యాదవ్ మాట్లాడుతూ గొర్రెలు, మేకల పశుగ్రాసం కోసం చెరువు శిఖం, బంచరాయి భూముల్లో తుమ్మ మొక్కలు నాటించి గొర్రెలు, మేకల పెంపకందారుల జీవనోపాధి మెరుగుపరచాలని మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

తుంగతుర్తి, జనవరి 23: క్రీడలతో స్నేహభావంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని జేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంకినేని కృష్ణారావు, బ్రదర్స్ సహకారంతో సంకినేని కమలమ్మ రామారావు జ్ఞాపకార్థం నిర్వహించిన రాష్ట్ర స్థాయి తృతీయ క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం విజేత జట్లకు బహుమతులు అందజేశారు. . మద్దిరాల మరిపెడ బంగ్ల(ప్రథమ), ఏవైసీ, తుంగతుర్తి(ద్వితీయ), సూర్యాపేట (తృతీయ) స్థానాలు సాధించాయి. కార్యక్రమంలో సర్పంచ్ సంకినేని రవీందర్‌రావు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాపుగల్లు సింగిల్ విండో డైరెక్టర్ మృతి

కోదాడ రూరల్, జనవరి 23: కాపుగల్లు సింగిల్ విండో డైరెక్టర్, టీడీపీ నాయకుడే మారుతి లక్ష్మీనర్సయ్య (68)గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయనను హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు.



భానుపురి: అంతర్జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గ ఉద్యోగులకు ముగ్గులు, కబడ్డీ పోటీలను సూర్యాపేట ఆర్డీవో కృష్ణయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్యాంసుందర్‌రెడ్డి, వీఈటీలు రషీద్, యాదగిరి, నాగమ్మ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో గణిత పోటీలను నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో విజేతలకు పరీక్ష ప్యాడ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో సభ్యులు బట్టు మధు, మాతంగి సైదులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను కస్తూరి ఫౌండేషన్ అధ్యక్షుడు చరణ్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రవి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: మండలంలోని బూరుగడ్డ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప. కార్యక్రమంలో శ్రీనాథ్, విశ్వనాథ్, వెంకటేశ్వర్లు, సుజాత, పూర్ణ, సక్కుబాయి, ఈవో లక్ష్మణ్‌రావు, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్, జనవరి 23: టీడీపీ నేత నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో టీడీపీ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మండవ వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల కోసం సంక్షేమ నిధి ఏర్పాటుచేసిన ఘనత లోకేష్‌కే దక్కిందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోషపతి, వెంకటేశ్వర్లు, రాములు, కనకరత్నం, వంశీ, సాంబా, రాంబాబు పాల్గొన్నారు.

● స్త్రీ నిధి రుణాలు నిబంధనల మేరకు 60 నెలల్లో చెల్లించేలా అవకాశం కల్పించాలని బూరుగడ్డకు చెందిన దివ్య గ్రూప్ సభ్యురాలు ముదిగొండ మరియమ్మ కోరారు. తీసుకున్న రుణాలు 20 నెలల్లోనే చెల్లించాలని అధికారులు కోరతున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు.

గరిడేపల్లి: తేనెటీగల పెంపకంతో యువత స్వయం ఉపాధి అవకాశా లు పొందవచ్చని కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త సీహెచ్ నరేష్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో తేనె టీగల పెంపకంపై మూడు రోజుల శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఏ.కిరణ్, ఎన్.సుగంధి,పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, అర్చకులు పాల్గొన్నారు.

● విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని పెదవీడు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కీత శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

చిలుకూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ కోరారు. మండలం కేంద్రంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ 2020 నవంబరు ఒకటో తేదీ కంటే ముందు పట్టభద్రులు ఫిబ్రవరి ఆరు లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కోదాడ రూరల్: పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరిని పెంపొందించడంతో పాటు మూఢ విశ్వాసాలను రూపుమాపడమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని ఎంపీపీ ప్రశాంతి కోటయ్య, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు చందా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెన్నారిగూడెంలో జనవిజ్ఞాన వేదిక పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. చిలుకూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 27న మండల స్థాయి జనవిజ్ఞాన వేదిక టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు.

చిలుకూరు: గ్రామాల్లోని ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలని డిఎస్పీ ప్రకాష్‌యాదవ్ సూచించారు. మండలంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడార్నారు కార్యక్రమంలో చిలుకూరు, కోదాడ ఎస్ఐలు శ్రీనివాస్ యాదవ్, రామాంజనేయులు, కళాజాత బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

మునగాల: మండల కేంద్రంలో మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులకు సైబర్ మోసగాళ్లబారిన పడకుండా ఏఎస్ఐ కృష్ణమూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాయిూశ్వరి పాల్గొన్నారు.

తిరుమలగిరి: పాఠశాలల విద్యార్థులకు తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి విద్యార్థులకు వ్యాస రచన పోటీలను ఈనెల 24న తిరుమలగిరిలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్ కందుకూరి నరేష్ తెలిపారు.

తుంగతుర్తి: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ముగ్గుల పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు తహసీల్దార్ యాదగిరిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్రప్రసాద్, డీఈవో బోయిన లింగయ్య, హెచ్ఎంలు యాకయ్య, భాస్కర్, చింతకుంట్ల శ్రీను పాల్గొన్నారు.